క్రేన్ కథల పోటీలో
కన్సొలేషన్ బహుమతి
పొందిన కథ

# నేస్తం ...!

- ఎబ్బిలి రవివంశి.



**పో**స్టులో వచ్చిన ఉత్తరాలన్నీ ముందేసుకుని కూర్చున్నాను. అందులో ఓ కవరు విప్పి ఆత్రంగా నాలుగు పంక్తులు చదివాను. ఏమీ అర్థం కాలేదు... అది ఎవరు రాశారో, ఎందుకు రాశారో అంతకంటే అంతుపట్టలేదు.

అందులో మర్యాదపూర్వక నమస్కారాలు, క్షేమ సమాచారాలు తర్వాత, మీరు నన్ను మరిచిపోయి ఉంటారు. ఓసారి గుర్తు చేస్తాను. గత సంవత్సరం రైల్లో మన పరిచయం జరిగింది. మీకు నేను నా విజిటింగ్ కార్డు ఇచ్చాను. మీరూ మీ కార్డు ఇచ్చారు. ఆ తరువాత... చదవటం ఆపాను. ఉత్తరం చివరన సంతకం చూశాను.

'నిఖితా కిరణ్' అని ఉంది. 'ఎవరబ్బా ఈ నిఖితా కిరణ్! ఇంతకీ ఎక్కడ నుండి రాసినట్టు' అనుకుంటూ ఉత్తరం పై భాగానికి నా చూపులను ప్రసరించాను బొంబాయి నుండి మూడు రోజుల క్రితం రాసినట్టు తెలుస్తుంది. రైలు ప్రయాణంలో ఎందరో కలుస్తుంటారు వారిలో ఎవరిని గుర్తుంచుకోగలం? రైలు ప్రయాణం కారణంగా అపరిచితులతో పరిచయం కలుగుతుంది. కొందరు తమ పరిచయాన్ని స్నేహంగా మలచుకోవాలని తమ తమ విజిటింగ్ కార్డులు ఇచ్చిపుచ్చుకుంటూ వుంటారు. చాలా వరకు ఎవరి గమ్యాలకు వాళ్ళు చేరాక విజిటింగ్ కార్డులకి టిక్కెట్లకు కలిగే మర్యాదే జరుగుతుంది. అవీ ఇవీ రెండూ నిరర్థకమవుతాయి. కానీ నేను అటువంటి మనిషిని కాదు. అందుకే ఆమె అడ్రసు నా దగ్గరే వుంటుందని తెలుస్తూ! అయినా ఈ రోజుల్లో రైలు మిత్రులు గుర్తుండేదెవరికి? పొద్దుపొడిచి పొద్దుగూగేవరకు సంపాదనకై శ్రమించడమే సరిపోతుంది అనుకుంటూ మళ్ళీ ఉత్తరాన్ని చదవటం మొదలుపెట్టాను. నేను ఆమె అడ్రసు కాగితం కొన్నాళ్ళవరకు జాగ్రత్త చేశాను. తర్వాత ఎలా పోయిందో పోయింది. మొన్నటి ఆదివారం ఉన్నట్టుండి "శ్రీశ్రీ" రాసిన 'మహాప్రస్థానం' మళ్ళీ చదవాలనిపించి షెల్ఫ్‌లో నుండి ఆ పుస్తకం తీశాను. నా ఆశ్చర్యానికి హద్దులు లేవు. అందులో ఆమె అడ్రసు కాగితం వుంది. దానిని నేనే అందులో పెట్టి మర్చిపోయాను. పోయిందనుకున్న చిరునామా దొరికేసరికి భలే సంతోషమన్పించింది. నాలో జిజ్ఞాస పెరిగింది. సుదూరాన వున్న బొంబాయి మహానగరంలో నన్ను ఇలా గుర్తుంచుకున్న మహిళ ఎవరో!.... అని ఆలోచించటం మాని మరల ఉత్తరం చదివాను అందులో...

"మీకు జ్ఞాపకానికి వచ్చిందా నిరుడు మనం రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో కలిశాం. బొంబాయి నుండి కొత్త ఢిల్లీ దాకా కలిసి ప్రయాణం చేశాం. మీ పక్క సీటే నాది కావడం వలన చాలా మాట్లాడుకున్నాం. మీరు మీది విజయవాడ అని, ఇంకా మీ సొంత విషయాలు చాలా చెప్పారు...'' ఏంటీ ఇంకా గుర్తుకురాలేదా? సరే! మరింత వివరంగా రాస్తాను.

"బొంబే సెంట్రల్ స్టేషన్‌లో మీరు చెయిర్‌కార్ కంపార్ట్‌మెంట్‌లో మీ సీట్లో కూర్చోవడానికి వచ్చినపుడు మీ కోసం రిజర్వుచేయించుకున్న సీట్లో నాతోపాటు ఓ యువకుడు కూర్చున్నాడు అది చూసి మీరు

సందిగ్ధంగా నిల్చుండి పోయారు. ఆ యువకుడు 'మోహన్' లేచి నిల్చుని మీ సీటు ఖాళీ చేసాడు. అతడు నాకు సెండాఫ్ చెప్పడానికి వచ్చాడు. ఆ తర్వాత మోహన్ గూర్చి మీకు చెప్పాను. ఆ సంబంధాన్ని గురించి పునర్నిర్మించుకోవాల్సి వుందని మీరు చెప్పారు. ఆ రాత్రి నేను నిద్రపోలేదు. ఆలోచనే కాదు, మీ గురక కూడా అందుకు కారణం ఆ సాయంకాలం మోహన్ నాకు సెండాఫ్ ఇవ్వడానికి వచ్చాడు కానీ నేను మర్నాటి ఉదయం కొత్త ఢిల్లీ స్టేషన్ చేరాక నా జీవితంలో నుండే అతనికి సెండాఫ్ ఇచ్చేశాను.

నాకిప్పుడంతా గుర్తుకొచ్చింది. ఈ జ్ఞాపకశక్తి కూడా విచిత్రమైనదే సుమా! మనం ఎందరినో కలుసుకుంటాం! వారిలో చాలా మందిని మరిచిపోతుంటాం. వారంతట వారే పలకరిస్తే బుర్రగోక్కుంటూ ఎక్కడ చూశానబ్బా! అని ఆలోచనల్లో పడతాం. కొందరు మాత్రం స్మృతి పొరలలో దాగి వుంటారు. ఇప్పుడు ఆ పొరలను చూస్తే వారు కళ్ళెదుటికి వస్తారు. అయితే ఇప్పుడామె 'నిఖిత' కిరణ్ అన్నమాట. ఆమె ఆకారం, రూపురేఖలు, ఆలోచనలు, ఆమె ఆంతరంగిక విషయాలు అన్నీ గుర్తుకొచ్చాయి.

"ఉత్తరం చివరన రాసింది, "ఇటీవలే వివాహం చేసుకున్నాను నేనిప్పుడు కుమారి నిఖితాను కాదు, శ్రీమతి నిఖితా కిరణ్‌ని... కిరణ్ ఇక్కడ కంపెనీలో కంప్యూటర్ ఇంజనీర్ గా పనిచేస్తున్నాడు. నేను వారి కంపెనీ పత్రికలోనే ఫోటో కంపోజింగ్ విభాగంలో ఉద్యోగం చేస్తున్నా! మా ఇద్దరి పరిచయం మా వైవాహిక బంధంతో ముడిపడటం వగైరా విషయాలన్నీ ఆసక్తికరంగా వున్నాయి. నేనీ ఉత్తరాన్ని మీకు రాయడం మొదలుపెట్టగానే కిరణ్ వచ్చి ఎవరికి రాస్తున్నావనడిగి "మీరు ఎప్పుడైనా బొంబాయికి వస్తే మా కోసం సమయం వెచ్చించాలని, మీరు తప్పక రావాలని తను మిమ్మల్ని ఆహ్వానిస్తున్నానని రాయమని" చెప్పారు. నా కొత్త చిరునామా పైన రాశాను. మీరు మా ఇంటికి తప్పక రావాలి! మేము ఢిల్లీకి వచ్చినప్పుడు తప్పకుండా మీ దగ్గరకి వస్తాం మీ అడ్రసు వున్నది"

ఉత్తరం చదివాక నాలో ఉత్సాహం పెరిగింది. మిగతా ఉత్తరాలు, ఆహ్వానపత్రాలు చూస్తున్నా పదే పదే నిఖితానే గుర్తుకొస్తుంది. పదిహేడు గంటల పాటు సాగిన మా ప్రయాణం మరోసారి నా కళ్ళముందు మెదిలింది. ఎందుకో గతంలోకి తొంగిచూశాను.

★ ★ ★ ★ ★

ఆ రోజు....

రైలు బయల్దేరే సమయానికి బొంబాయి సెంట్రల్ స్టేషన్‌కి చేరుకున్నాను. చెయిర్‌కార్ కంపార్ట్‌మెంట్‌లో రిజర్వు చేసుకున్న నా సీటు దగ్గరకు వెళ్ళేసరికి ఓ యువకుడు కూర్చుండటం చూశాను. ఎలా అడగటం అని సంకోచించిన మాట వాస్తవం! జేబులో నుండి నా టిక్కెట్టు తీసి మరోసారి నెంబర్ చెక్ చేసుకున్నాను. నా సీటు అదే! అయితేనేం ఆ యువ దంపతులకు ఈరెండు సీట్లు బాగున్నాయన్పించింది.అంతలో ఆ యువకుడు లేచి నిల్చుని "సార్ ఇది మీ సీటే! నేనీమెకు సెండాఫ్ ఇవ్వడానికి వచ్చాను" అన్నాడు. అంతేకాదు నా చేతిలోని సూట్‌కేసును తీసుకుని పైన లగేజ్ బ్రాకెట్‌లో పెట్టాడు. తర్వాత ఓసారి చేతిగడియారంలోకి చూసి, ఆ యువతి చేతిని మృదువుగా స్పృశించాడు. తర్వాత క్రిందకు దిగి ప్లాట్‌ఫారమ్‌పై నిలచున్నాడు. రాజధాని ఎక్స్‌ప్రెస్‌కి నల్లని గాజు తలుపులున్నందున అతను మా కిటికీ దగ్గరే నిల్చున్నా లోపలికి స్పష్టంగా చూడలేకపోయాడు. ఇంతలో బండి కదిలింది. లోపలికి చూడాలన్న అతని తాపత్రయానికి తెరపడింది. అతను ఆ యువతికి వీడ్కోలు చెపుతున్నట్లుగా చేయి ఊపాడు. ఇక్కడి నుండి ఈ యువతి కూడా చేయి ఊపుతుండగా ఆమె కళ్ళు చెమ్మగిల్లటం నా చూపును తప్పించుకోలేకపోయెను. ఇంతలో రైలు స్టేషన్‌ను విడిచి వంద మీటర్లు ప్రయాణించి ఆగింది. తరువాయి అది వెనక్కి ప్రయాణించడం మొదలుపెట్టింది. ఎందుకనగా ఇంజన్‌లో ఏదో లోపం వుందని తిరిగి రైలు బొంబే సెంట్రల్ స్టేషన్‌కు వచ్చింది. రైలు ప్లాట్‌ఫారమ్‌పై ఆగి ఆగగానే ఆ యువతి కళ్ళు అతని కోసం వెదకనారంభించాయి. తర్వాత సీట్లోంచి లేచి కంపార్ట్‌మెంట్ ద్వారం దాకా వెళ్ళి ప్లాట్‌ఫారమ్‌కి ఒక వైపు మొత్తం చూసి మరో వైపు కూడా చూసి నిరాశగా సీట్లోకొచ్చి కూర్చుంది. ఒకరి కొకరు వీడ్కోలు చెప్పుకున్నప్పటి బాధను నేను ఆమె కనులలో చూశాను. కనుక ఇక వుండలేక "ఒకసారి బయల్దేరిన రైలు వెనక్కి రావడం చాలా అరుదు. అందుకే మీ శ్రీవారు వెళ్ళిపోయినట్లున్నారు" అన్నాను.

ఆమె నావైపు చూసి కోపం, బాధతో కూడిన భావాలతో, "అతను నా భర్త కాదు. నేనింకా అవివాహితనే" అన్నది బిగ్గరగా... నా తొందరపాటుకు పశ్చాత్తాపపడ్డాను. స్టేషన్‌కు వచ్చిన వ్యక్తి ఫలానా అని ఆమె చెప్పడం లేదు మరి అతనెవరై వుంటారు? ఆమె ఇంకా అవివాహితే అయితే ఇతనెవరు? బహుశా స్నేహితుడేమో? సమాజం చాలా త్వరితగతిలో మారుతుంది. ఈ రోజుల్లో ఓ యువతిని స్టేషన్ వరకూ వచ్చి సాగనంపడానికి అన్నో, భర్తో రావాలనే నియమమేమీ లేదు". నేను క్షణకాలంలో నా భావాల నుండి బయటకు వచ్చి ఆమెతో "నన్ను క్షమించండి నేను పొరపాటుపడ్డాను" అన్నాను. ఆ యువతి కళ్ళింకా ప్లాట్‌ఫారమ్‌పైనే తచ్చాడుతున్నాయి. చూపులు ఇటు వైపు తిప్పి "పర్వాలేదులేండి! మీ సీటులో 'మోహన్'

> "ఒత్తిడికి లొంగి ప్రేమను మరచి మరో పెళ్ళి చేసుకున్నాడు. అతడు బలహీనమనస్కుడు. ఒత్తిళ్ళకు లొంగేవారు ప్రేమకు అనర్హులు. ప్రేమను త్యజించి మళ్ళీ దాన్ని అనుభవించా లనుకుంటున్నాడు. అతను చాలా స్వార్థపరుడు. అతను లేకుండా వుండలేననుకోవడం నీ వయస్సు వాళ్ల స్వాభావిక లక్షణం".



తీరును చూసి మీరలా అనుకుని వుంటారు. అన్నది ఆమె జవాబులో ఎంతో వినయ విధేయతలు ఇమిడి వున్నాయి. బహుశా మంచి సాంప్రదాయపరుల కూతురై వుంటుంది. కానీ నాకెందుకో ఇక అక్కడ కూర్చోవాలని పించలేదు. ప్లాట్‌ఫారం దిగి ఆ యువతి చూపులకు అందనంత దూరంలో నిల్చున్నాను. రైలు కదిలేవరకు లోపలికి వెళ్ళలేదు. ఇంజను బాగుచేశాక యాభై ఎనిమిది నిముషాల ఆలస్యంతో మళ్ళీ మా బండి బయల్దేరింది. సీట్లో కూర్చున్న తర్వాత ఇంతకు ముందు రైల్వే బుక్‌స్టాల్‌లో కొనిన ఓ పత్రికలో తలదూర్చాను. ఇంకా ప్రాంతీయ దాదార్ స్టేషన్ రాలేదు. అంతలో రాజధాని ఎక్స్‌ప్రెస్ పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌పై సిబ్బంది తరుపున మా ప్రయాణీకు లందరికీ స్వాగతం పలికి, కాసేపట్లో ప్రయాణీకుల అభిప్రాయం మేరకు కాఫీ, టీలు అందిస్తున్నామన్న ప్రకటన వినిపించింది. టీ తాగే సమయానికే టీ అందడం నాకు నిజంగానే సంతోషాన్నిచ్చింది. పత్రికలోని కథను చదువ సాగాను. చదువుతుంటే ఆ కథలో తప్పులనేకం రావడం గమనించి ఆలోచించ సాగాను. పత్రికలను లెటర్ ప్రెస్‌లో ముద్రించే రోజుల్లో ప్రూఫ్‌రీడర్లు పొరపాటున వదిలేశారనుకునే వాళ్ళం. కానీ ఇప్పుడు ఫొటో కంపోజింగ్ వచ్చిందిగా! పత్రికల్లో ఇటీవల ముద్రణా ోషాలు బాగా పెరిగాయి. పదాన్ని సరైన ంతిలో వివరించక కింది పంక్తిలో ఓ అక్షరమో, ప్రశ్నార్ధకమో, ఆశ్చర్యార్ధకమో, ఫులుస్టాపో కనిపిస్తుంది. ఇదేం నాగరికతో మరి? అచ్చుతప్పుల్ని చూసి మనసులోనే కంగుతిన్నాను. ఆ కథ చదువుతుంటే పైన రావల్సిన పేరా క్రింద వచ్చినట్లనిపించింది. నిజానికి ఆ పేరా పైన వుంటే బాగుండేది. నా కథా ప్రవాహానికి అడ్డు తగిలిన భ్రాంతి కలిగింది. ఇక నేనుండలేక పోయాను. జేబులో నుండి పెన్ను తీసి తప్పుల్ని దిద్దసాగాను. పేరాను పై వైపు మళ్ళించేలా సరైన చోటుకి బాణం గుర్తు పెట్టాను.

ఇదంతా నా ప్రక్కసీటులో కూర్చున్న యువతి పరిశీలించింది. ఆమె కాఫీ గుక్కతాగి, "ఈకథలో ఇన్ని 'ప్రింటింగ్ ఎర్రర్స్' వున్నాయా?" అంది ఆసక్తిగా దానికి నేను సమాధాన మిచ్చేలోగా మళ్ళీ తనే పోనివ్వండి! ఈ అచ్చుతప్పుల సంగతి వదిలేద్దాం క్రింది పేరా పైన ఉండాలని మీకెలా తెలిసింది? మీ వద్ద ఈ కథ రాత ప్రతిగానీ ఉందా ఏమిటి? అంది పరిశీలనగా చూస్తూ నేనామెవైపు చూస్తూ "ఈ కథ ప్రతి లేదు ఏమీ లేదు ఓ మంచి పాఠకుడికి ఆ మాత్రం తేడా తెలియదా ఏం? ఏ పేరా ఎక్కడ వస్తే బాగుంటుందో తెలుసుకోవడం ఏమంత కష్టం కాదే..." అన్నాను.

"నిజమేలేండి! నేను మీతో ఏకీభవిస్తు న్నాను..." అంటూ నవ్వేసిందామె! కాసేపాగి "నేనో వార్తా పత్రిక కార్యాలయంలో లేజర్ ప్రింటర్‌పై పనిచేస్తాను. ఈ దోషాలు ఎందుకు, ఎలా వస్తాయో నాకు తెలుసు" అన్నది ఆమె.

"ఎందుకు వస్తాయి?"

ఆసక్తిగా అడిగాను ఆమె నా చేతిలోని పత్రిక తీసుకుని నాకు అర్థమయ్యేలా చెప్పాలని గ్యాలిలోని ప్రూఫులు శ్రద్ధగా చదివితే లేజర్ ప్రింటర్ స్క్రీన్‌పై ఈ తప్పులు సులభంగా సరిచేయవచ్చు. కానీ వీళ్ళు ప్రూఫులను శ్రద్ధగా చదవరు మాపై వదిలివేస్తారు. పైన రావాల్సిన ఈ పేరా పొరపాటున క్రింద వచ్చింది. ఎందుకంటే మధ్యలో ఈ రంగుల చిత్రం రావటం వలన బ్రొమైడ్ పేపర్‌ను లే అవుట్ షీట్ పైన సరియైన స్థలంలో అతికించలేదు. ఇలాంటి తప్పులు పత్రికలో పనిచేసే ఉప సంపాదకుల వలన జరుగుతాయి.

"మీకీ విషయాలన్నీ క్షుణ్ణంగా తెలుసను కుంట! ఆసక్తికరమైన ఉద్యోగం సుమా!" అన్నాను. ఇది విని ఆమె ముఖకవళికలు మారిపోయాయి. బహుశా, తాగుతున్న కాఫీ రుచి కూడా మారే వుంటుంది. "అదే పనిని ప్రతి రోజూ చేస్తూ ఉంటే మీకైనా అందులో ఆసక్తేం కనిపించదు" అందామె.

అలా మామధ్య కబుర్లు చాలా దొర్లాయి. ఉల్లిగడ్డ పొర ఒకటి తీస్తే మరొకటి వచ్చినట్లు ఒక దాని నుండి మరొక అంశం మా చర్చలలోకి రావటం జరిగింది. ఆమె చాలా అందంగా ఉంది. ఆమె స్వస్థలం ఢిల్లీయేనని చెప్పింది. ఢిల్లీలో చదివానని, బొంబాయిలో ఉద్యోగం దొరికిందని తనూ మరో ఇద్దరు అమ్మాయిలు ఝాన్సీ, శిరీషలతో కలసి ఓ అద్దెగదిలో ఉంటున్నానని చెప్పింది.

అంతలో రాజధాని ఎక్స్‌ప్రెస్ బేరర్లు మాకు రాత్రి భోజనం తెచ్చారు. భోజనానికి ఉపక్రమించే ముందు తన ప్లేటులోని పెరుగు కప్పును తీసి నా ప్లేటులో పెట్టింది. "మీకు పెరుగు ఇష్టమైతే తీసుకోండి నేను తినను" అంది సరే అన్నాను అన్యమనస్కంగా....

"నిఖితా గారూ మిమ్మల్ని ఒక మాటడు గుతాను మీరేమీ అనుకోనంటే! అడగనా" అన్నాను. ఏవండీ ఈ గారూ మీరూ నా కసలు నచ్చవు" అన్నది నిఖితా వెంటనే నేను

"సరే నిన్నో మాటడగనా"?

'అడగండి' అన్నది గంభీరంగా!

"బోంబే సెంట్రల్ స్టేషన్‌కి వచ్చి నీకు వీడ్కోలు పలికిన ఆ యువకుడు ఎవరు"?

"నా బోయ్‌ఫ్రెండ్! ఏం అలా అడుగు తున్నారు".

"మరేం లేదు నీ ఫీలింగ్స్‌ను బట్టి మీ ఇద్దరికీ ఒకరంటే ఒకరికి చాలా ఇష్టం అనిపించింది" "అది నిజమే!" ఒక్కక్షణం ఆగి మళ్ళీ తనే అన్నది. "కానీ... గత రెండు మూడు నెలల నుండి గొప్ప చిక్కుల్లో పడ్డాం". మీ ఇద్దరి

పెళ్ళికి ఏమైనా ఆటంకాలొస్తున్నాయా? ఎవరైనా అడ్డుపడుతున్నారా? ఆఁ అదే చెప్పబోతున్నాను తల్లిదండ్రులు బలవంత పెట్టడంతో రెండున్నర నెలల క్రితం అతను మరో అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాడు. పెళ్ళయితే చేసుకున్నాడే గానీ నేనంటేనే అతనికి ప్రేమ ఇప్పుడు చెప్పండి మీరే – మేమేం చేయాలో.

ఆమె మాటల్లో మౌనం గమనించాను. నాకైతే వెంటనే ఏం జవాబు చెప్పాలో తోచలేదు. ఆ యువకునిపై నా మనసులో ఏదో అనుమానం కలిగింది. ఏదైతేనేం నా భావం చెప్పదలచుకున్నా.

"నీతో ప్రేమ సంబంధాలు కొనసాగించాలనుకుంటున్నాడా అతను" కొన్ని క్షణాలాగి అన్నాను.

"అవును.... నేను కూడా మోహన్ లేకుండా ఉండలేను"

"నేనేది ఊహించానో వారిద్దరి మధ్య అదే జరుగుతుంది", ఆమె మోహన్‌ని సమర్ధిస్తుంది. నేనామెవైపు చూసి, "ఈ విషయంలో ఏం చెప్పాలో ఏం చెప్పకూడదో తెలియడంలేదు".

ఉలిక్కిపడి, "పర్వాలేదు చెప్పండి..." మనం ఇప్పుడు మంచి నేస్తాలము. మన భావాలు కలిశాయి. అంతరాలెందుకు చెప్పండి... అన్నది.

ఓ మంచి "నేస్తం"గా మిగలాలని నేనిలా బదులిచ్చాను.

"ఒత్తిడికి లొంగి ప్రేమను మరచి మరో పెళ్ళి చేసుకున్నాడు. అతడు బలహీనమనస్కుడు. ఒత్తిళ్ళకు లొంగేవారు ప్రేమకు అనర్హులు. ప్రేమను త్యజించి మళ్ళీ దాన్ని అనుభవించాలనుకుంటున్నాడు. అతను చాలా స్వార్థపరుడు. అతను లేకుండా వుండలేననుకోవడం నీ వయస్సు వాళ్ల స్వాభావిక లక్షణం".

మన భావాలు పద్ధతులు ఒకటేనన్నావు కానీ కాదు నేనైతే ఇటువంటి మనస్తత్వం కలవారిని దగ్గరకైనా రానివ్వను వారు ఆడవారైనా, మగవారైనా నైతిక విలువలను కాపాడలేని వారికి నా మనస్సులో చోటివ్వను. కానీ ఒక్క మాట జీవితంలో ప్రతీ అడుగు ఎంతో ఆలోచనతో వేయాలి లేకపోతే జీవితం మొత్తం నాశనం అయ్యే అవకాశం వుంటుంది. అంతే కాక ఇటువంటి విషయాల్లో చాలా జాగ్రత్తగా వుండాలి. అయినా మనిషి మేధస్సుతో అంతరిక్షం దాకా వెళ్ళినా అంతరాత్మకు విలువివ్వడంలేదు.

"జీవితమంటే ఏదో టైమ్‌పాస్‌కి చేసే బస్సు ప్రయాణమో, ఆటో ప్రయాణమో కాదు. మనం చేరవలసిన గమ్యం కోసం చేసే రైలు ప్రయాణం"గుర్తుంచుకో! ఒక్క విషయం కానీ నీవీ సంబంధాన్ని రీఢిఫైన్ చేయాల్సి వుంది".



అతడిని వారిద్దరి సంబంధాన్ని విమర్శిం చిన నా మాటలు ఆమెకు కొరడా దెబ్బల్లా తగిలినట్లున్నాయి. ఆమె భూకంపం వచ్చినట్లు కదలిపోయింది. కొన్ని క్షణాలపాటు నన్ను కొరకొరా చూసింది. తర్వాత చూపు తిప్పుకుంది. ఆ తర్వాత మా మధ్య మాటలేం సాగలేదు ఆమె మౌనం మా మధ్య దూరాన్ని పెంచినట్లైంది. కొన్ని క్షణాలపాటు అపరిచితుల్లానే ఉండిపోయాం ఈ యాత్రలో ఇద్దరం స్నేహితులమయ్యాం. మా మధ్య ఉన్న స్నేహసంబంధం కాసేపటికే తెగిపోయింది.

ఆశ్చర్యమేమిటంటే ఈ భావాలన్నీ మర్నాడు మానిపోయాయి. నా పట్ల ఆమె విధేయతా, విముఖతా ఏమాత్రం వ్యక్తం కాలేదు. ఆ ఉదయం ఉత్సాహంగా ప్రారంభమయ్యింది.

ఆ ఉదయం టీ రాగానే "ఏమండీ! హలో సార్ లేవండి! టీ వచ్చింది" అంటూ ఆమె పిలిచింది. కనులు విప్పి చూశాను. ఆమె శుభ్రంగా తలదువ్వుకుని తాజాగా కనిపించింది. నేను సోమరిగా నిద్రపోయాననిపించింది".

"నన్ను అప్పుడే లేపక పోయారా? మీకు నడవడానికి ఇబ్బందిగా దారిలో వున్నాను గదూ" అన్నాను.

"అదిగో మళ్ళీ మీరూ... మీరూ అంటు న్నారు". మీరు గాఢ నిద్రలో వున్నారు. ఎలా లేపగలను? మధుర స్టేషన్ కూడా దాటిపోయింది. అరే! మధుర వెళ్ళిపోయిందా? అయితే ఇక ఢిల్లీ దూరమేం లేదు" అంటూ టీ చప్పరించాను. ప్రయాణంలో చివరి గంటా గంటలు ఎవరికైనా చాలా కష్టంగా గడుస్తాయి. కానీ సమయం ఎలా గడిచిందో తెలియలేదు. ఆమె తన విజిటింగ్ కార్డు యిచ్చింది.

ఇంతలో హజారత్ నిజాముద్దీన్ స్టేషన్ రానే వచ్చింది. స్టేషన్ రాగానే కంపార్ట్‌మెంట్ ద్వారం దాకా వచ్చి నాకు వీడ్కోలు చెప్పాలనుకుంది. రైలు దిగగానే ....

"నిఖితా! నిన్న బొంబే సెంట్రల్ స్టేషన్‌లో మన రైలు ఇంజన్ చెడిపోయినప్పుడు దాన్ని మార్చారు. చెడిపోయిన ఇంజన్‌ను వదిలి పెట్టాకే రైలు కదిలింది. ఆ ఇంజన్‌ను వదిలి పెట్టకపోతే రైలు కదిలేదేనా! మనం ఇక్కడికి చేరే వారిమేనా? నీవు దీని గురించే మరో సారి ఆలోచించు..." అన్నాను నవ్వుతూ.

ఆమె చిన్నగా నవ్వి "రాత్రంతా మీరన్న మాటలే పదే పదే నా చెవుల్లో ప్రతిధ్వనిస్తుంటే బాగా ఆలోచించాను. ఏం చేయాలో అర్థమైంది. ఒక స్థిర నిర్ణయానికి వచ్చాను అంది.

ఇంతలో రైలు సిగ్నల్ ఇచ్చాడు. కూత వినిపించింది. గుండెల్లో ఏదో బాధాభావన. ఏం చేస్తాం! ! ఇంతలో నా విజిటింగ్ కార్డు ఆమెకు యిచ్చాను. రైలు కదిలింది. మరోసారి ఇద్దరం వీడ్కోలు చెప్పుకున్నాం. ఆమె యిచ్చిన కార్డులో ...

"నేస్తం" అని స్నేహార్థం వున్నది.